అన్నదాతలకు అండ

- ఆదర్శంగా కొరిటికల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం
- ఏటా రూ.కోటి వరకు వ్యాపారం
- ఆర్థిక ప్రగతివైపు కర్షకులు



పసుపు స్పైస్‌బోర్డు అందించిన పరికరాలు



కొరిటికల్‌లో సంఘ భవనంలో విత్తనాలతో సభ్యులు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో అన్నదాతలు ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గ్రామంలో పంటలు పండించేవారు రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో)గా ఏర్పడి విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను తక్కువకు విక్రయిస్తున్నారు. ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన యంత్రాలను సభ్యులతోపాటు ఇతరులకు అద్దెకు ఇవ్వడం వలన ఈ సంఘానికి ఆదాయం సమకూరుతోంది. దీంతో రైతులకు పెట్టుబడులు తగ్గుతున్నాయి. 2018లో ప్రారంభమైన కొరిటికల్ ఎఫ్‌పీవోలో ప్రస్తుతం 487 మంది సభ్యులున్నారు. కొత్తగా సంఘంలో చేరేవారు సభ్యత్వ రుసుం రూ.6500 చెల్లించాలి.

నాలుగు వేల జనాభా..

మండలంలోని కొరిటికల్ గ్రామంలో నాలుగు వేల వరకు జనాభా ఉంటుంది. 638 హెక్టార్లలో(హెక్టార్=2.2ఎకరాలు) పంటలు సాగవుతున్నాయి. పసుపు పంట సాగులో జిల్లాలోనే కొరిటికల్ గ్రామ రైతులు ముందంజలో ఉంటారు. పసుపుతోపాటు సోయాబీన్, మొక్కజొన్న, వరి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. జిల్లాలో ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లితోపాటు కొరిటికల్‌లో మాత్రమే ఈ సంఘాలున్నాయి

'అరణ్య'సహకారంతో

ఈ గ్రామ ఎఫ్‌పీవోలోని సభ్యులకు అరణ్య అనే స్వచ్ఛంద సంస్థ పూర్తి సహకారం అందిస్తుండటంతో వారు ప్రగతిపథంలో సాగుతున్నారు. సంఘం ఏర్పడక ముందు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, యంత్రాలను కొనేందుకు ఎక్కువ వ్యయం అయ్యేది. ఎప్పటికప్పుడు అరణ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గ్రామంలో పర్యటించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. పది మంది డైరెక్టర్లతో కూడిన ఈ సంఘం ప్రతి నెల సమావేశాలు నిర్వహించి సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను చర్చిస్తారు.

- రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొరిటికల్‌లోని ఎఫ్‌పీవో సభ్యుల పొలాల్లో డ్రోన్ల ద్వారా నానో యూరియా పిచికారీ చేయిస్తున్నారు. సాగులో రైతులు పాటించాల్సిన మెళకువలపై సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన పసుపు,స్పైస్ బోర్డు కొరిటికల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ)కు రూ.13.60 లక్షల విలువైన పసుపు ఉడికించే రెండు బాయిలర్లు, రెండు పసుపు పాలిష్ యంత్రాలను సబ్సిడీపై రూ.3.90లక్షలకే సంఘానికి అందించారు. దాదాపు 400 పాలిథిన్ కవర్లను కూడా రైతులకు అందించింది. ఈ యంత్రాలను అవసరమైన రైతులు వినియోగించుకొని అద్దె చెల్లిస్తున్నారు.
- ఇఫ్‌కో కంపెనీ అందించిన ట్రాక్టర్ స్ప్రేయర్‌ను రైతు సంఘంలోని సభ్యులు వినియోగించుకొని మందులను పిచికారీ చేస్తున్నారు. పలు కంపెనీలు ఎరువులు, విత్తనాలు, యంత్రాలను తక్కువ ధరలకు అందిస్తుండటంతో సంఘంలోని సభ్యులు వాటిని సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందుతున్నారు.
- ఈ సంఘానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సైతం తక్కువ వడ్డీకి రూ.20 లక్షల రుణం మంజూరు చేసింది. దీంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. భవిష్యత్తులో కొంత నిధి జమ చేసుకొని గోదాం నిర్మించనున్నట్లు సభ్యులు తెలిపారు.

త్వరలో పంటల కొనుగోళ్లు..

ఇప్పటికే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్న సంఘం త్వరలో పంటలను కొనుగోలు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తుంది.

ప్రోత్సాహం అందిస్తున్నారు



మా సంఘం ఆధ్వర్యంలో గతేడాది రూ.కోటి వరకు ఎరువులు, విత్తనాల వ్యాపారం నిర్వహించాం. అరణ్యతోపాటు రిలయన్స్ ఫౌండేషన్, ఇఫ్‌కో, క్రిబ్‌కో, నాగార్జున, పసుపు, స్పైస్ బోర్డులు మా సంఘానికి అండగా నిలుస్తూ అవసరమైన ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు అందిస్తున్నారు. – సామల భీంరెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్

సంఘంతో రైతులకు మేలు



మా సంఘాన్ని నాబార్డు గుర్తించి సాయం అందిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుంది. రైతులు సంఘటితంగా ముందుకెళితే అవగాహన సమావేశాల ద్వారా సాగులో ఆధునిక పద్ధతులు తెలుసుకోవచ్చు.
– సుమన్‌కుమార్, ఎఫ్‌పీవో సీఈవో

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ ఫలాలు

- బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాలన ఎట్లుందో తెలుసుకోండి
- ఓటర్లకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విజ్ఞప్తి



నిర్మల్‌రూరల్: చిట్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధితోపాటు పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఐకేరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల, తాంశ, కొట్ల (కే), ముజ్గి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాలన ఎట్లుందో.. తెలుసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ అభివద్ధిని గాలికి వదిలేసి కులం, మతం ఆధారంగా ఓట్లు దండుకునే పయత్నాలు చేస్తుందని పేర్కొన్నారు.

అభివృద్ధి ఆగద్దు అంటే ఆలోచించండి

నిర్మల్‌టౌన్: నియోజకవర్గంలో అభివృద్ధి ఆగొద్దంటే ఆలోచించి ఓటేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సారంగపూర్ మండలంతోపాటు పట్టణంలోని బాలాజీవాడకు చెందిన 50 మంది యువకులు దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్, దేవేందర్ యాదవ్, అల్లోల మురళీధర్ రెడ్డి, ఆకుల రామకృష్ణ, అరుణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మామడ, ఆరేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మోతే రాజన్న, వెలుముల రాజేశ్వర్, అంబకంటి ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీనే మూడోసారి గెలిపించాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మళ్లీ గెలిపిస్తే నిర్మల్‌తోపాటు సారంగపూర్ మండలం రూపురేఖలు మార్చేది ఐకేరెడ్డి మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరావు తదితరులు ఉన్నారు.



మామడ: ప్రచారం చేస్తున్న నాయకులు



లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మంత్రి ఐకేరెడ్డి చేసిన అభివృద్ధి చూసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు మునిపెల్లి, న్యూకంజర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని 74 ఆలయాలకు రూ.10 కోట్లకు పైనే నిధులు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షులు జహీరుద్దీన్, సిరాజ్, మల్లయ్య, భూమన్న, శ్రావణ్, గోవర్ధన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సోన్ మండలంలో..

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిచారు. గ్రామంలో ఒకటి, రెండు వార్డుల సభ్యులు తలారి ప్రభాకర్, జంగం చరణ్‌రాజ్ బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి ఆ పార్టీ మండల ఇన్‌చార్జి మహేశ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, రొడ్డ రాజేశ్వర్, కిరణ్‌రావు, నర్సయ్య, భూమేశ్, మల్లయ్య, సురేశ్‌యాదవ్, హరీశ్, భీమేశ్, దయాకర్, శ్రీనివాస్, శబరి, రాజేందర్ తదితరులున్నారు.

గెలిపించండి.. అండగా ఉంటా

- భూకబ్జాల మంత్రికి ఓటుతో బుద్ధి చెప్పాలి
- నిర్మల్ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: తనను ఆశీర్వదించి.. నిర్మల్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్వతండా, కాల్వ, సిర్గాపూర్, బన్సపల్లి, కంజర్, సాంగ్వి, మల్లాపూర్, మాయాపూర్, న్యూలోలం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాల్వతండాలో మాజీ జెడ్పీటీసీ ఆమ్గోత్ సుజాత ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్యాలతో గిరిజనులు.. బన్సపల్లిలో భారీ గజమాలతో మహేశ్వర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట దోచుకున్నా.. మంత్రి రైతుల పక్షాన నిలబడలేదన్నారు. నిర్మల్ పరిసరాల్లో రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేసిన మంత్రికి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. పేదప్రజల సంక్షేమం బాధ్యత నాదని.. కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. దిలావర్‌పూర్ జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సిర్గాపూర మాజీ ఎంపీటీసీ సత్యం చంద్రకాంత్, మాజీ ఎంపీపీ ఫణీంధర్‌రావు, బన్సపలి, సాంగ్వి సర్పంచ్‌లు పద్మ, అచ్యుత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్: బన్సపల్లిలో కన్నీటి పర్యంతమై మహేశ్వర్‌రెడ్డిని హత్తుకున్న వృద్ధురాలు

నర్సాపూర్(జి): తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం రాత్రి మహేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అర్జున్ ఠాగూర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, నరేందర్ పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ నాయకులు లక్ష్మణచాందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడ్వాల రమేశ్, సర్పంచ్ ముత్యం రెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, రంజిత్, రాజు, నర్సారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన పలువురు వీడీసీ కమిటీ సభ్యులు, యాదవులు, యూత్ సభ్యులు శుక్రవారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వారికి మహేశ్వర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవిద్య, భూపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గాజులపేట, బంగల్‌పేట్, విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్ కాలనీ, డాక్టర్స్‌లేన్, బుధవార్‌పేట్, కబూతర్ కమాన్, నాయుడువాడ, కావేరినగర్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తానూరు మండలంలో..

తానూరు: విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ జాదవ్ ప్రదీప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దు

కుంటాల: అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింబా(బి) గ్రామంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని కోరారు.

ఓటరు చీటీలు పంపిణీ చేయాలి

పెంబి: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెరిగేలా ఇంటింటికీ వెళ్లి ఓటరు చీటీలు పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మణ్ బీఎల్‌వోలకు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలకు తహసీల్దార్ ఓటరు చీటీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లచ్చిరాం, సీనియర్ అసిస్టెంట్ రాజం, ఆర్‌ఐ శ్రావణ్, బీఎల్‌వోలు సంపూర్ణ, మాధవి, జన్ను, లక్ష్మి, సుశీల, సునీత ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కకు నీటిని పడుతున్న విజయలక్ష్మి

కుంటాల: హరితహారంలో నాటిన మొక్కలకు నీటిని అందించి సంరక్షించాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవా రం మండలంలోని ఓలాలో వాటరింగ్ డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పట్టి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురి చేస్తే ఫిర్యాదు చేయండి

భైంసాటౌన్: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా.. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పట్టణ సీఐ ఎల్.శ్రీను అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖాజిగల్లీలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని, పెండింగ్ చలాన్లు ఉన్న 72 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే.. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సందీప్, ఎండీ గౌసుద్దీన్, కిశోర్, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, బీఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

వాహనాల తనిఖీ



భైంసాలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రా మ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాహనాలను క్షుణ్ణం గా పరిశీలించారు. తనిఖీల్లో తహసీల్దార్ ప్రవీణ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, భైంసారూరల్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి

భైంసారూరల్: విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండలంలోని దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజీమ్ అన్నారు. శుక్రవారం భైంసాలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 250 మంది విద్యార్థుల రక్తనమూనాలను పరిశీలించి గ్రూపులను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలమూత్ర విసర్జన తర్వాత.. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు నరేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



రక్తపరీక్షలు చేస్తున్న కళాశాల విద్యార్థులు

గ్రామాల్లో పోలీసులు, జవాన్ల కవాతు

తానూరు: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కవాతు చేపడుతున్నట్లు ఎస్సై సందీప్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికల వేళ గొడవలకు దిగి కోర్టుల చుట్టూ తిరగవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: ఓటుహక్కును ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలో బీఎస్‌ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో భైంసారూరల్ సీఐ నైలు, కుంటాల ఎస్సై హన్మాండ్లు, కుభీర్ ఎస్సై ఎండీ.షరీఫ్ తదితరులున్నారు.



కుభీర్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు, జవాన్లు

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కుంటాల: రైతులు తమ పంటను దళారులకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని నిర్వాహకులు లక్ష్మీకాంత్, వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓలా గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెంబి: మండలంలోని మందపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సుచిత్ర, మురళిలను శుక్రవారం వీడీసీ, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు బదిలీపై వచ్చిన నూతన ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మురళి, ఉపాధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, శ్రావణ్, వెంకటరమణ, అఖిల్, అంజుమ్, సంగీత తదితరులు ఉన్నారు.

కంటివైద్య శిబిరం

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఆమూల్య ఐకేర్‌లో శుక్రవారం ఉచిత క ంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేసిన వారిలో మోతెబిందు కంటి ఆపరేషన్ నిమిత్తం లయన్స్‌క్లబ్ సహకారంతో ఆర్మూర్ ఆసుపత్రికి పంపిస్తున్నామని నేత్ర వై ద్య సహాయ నిపుణులు వై.భీంరావు తెలిపా రు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

'బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ'

ఖానాపూర్: బహుజనులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి నర్సాగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సమావేశంలో భాస్కర్, రాజేందర్, మురళి, శ్రీనివాస్, కిశోర్, సురేశ్, సత్యనారాయణ, సంతోశ్, గంగాధర్, రాజన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన శ్రేణులు

ఖానాపూర్: జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి వాహనాల్లో వెళ్లారు.

కడెం: జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చిన్నబెల్లాల్‌తోపాటు ఆయా గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు వాహనాల్లో జన్నారం వెళ్లారు.



కడెం: సభకు వెళ్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: జన్నారంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు మండల కేంద్రం నుంచి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుతి డోంగ్రె ఆధ్వర్యంలో నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు సుఫీయన్, కోవ రాజేశ్వర్, రాథోడ్ మోహన్‌నాయక్, మీర్జా జీలానిబేగ్, జాదవ్ లఖన్ ఉన్నారు.



ఇంద్రవెల్లి: తరలివెళ్తున్న నాయకులు

రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటేయండి

- నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు

సోన్: రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు బొప్పారంన్యూవెల్మల్, సంగంపేట, కూచన్‌పెల్లి, సాకెర, కడ్తాల్, గంజాల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వివరించి.. కరపత్రాలు పంపిణీ చేశారు. ఉద్యమకారులను, నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మల్లారెడ్డి, గడ్డం స్వామి, గంగాధర్, నర్సారెడ్డి, అమృత్‌రాజ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద: బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని.. నిర్మల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఈటల శ్రీనివాస్, వినేశ్, భీమేశ్, గంగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



సోన్: సంగంపేటలో ప్రచారం చేస్తున్న శ్రీహరిరావు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లోకేశ్వరం: ప్రలోభాలకు లొంగకుండా, గొడవలకు దిగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిలోలి, సాథ్‌గాం, కిష్టాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్ తదితరులు ఉన్నారు.



బిలోలిలో మాట్లాడుతున్న సోలమాన్‌రాజ్